## సొసైటీ చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ పరామర్శ




రమేశ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పాపన్నపేట, మార్చి 31: కొత్తపల్లి సొసైటీ చైర్మన్ త్యార్ల రమేశ్‌ను మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి సోమవారం కొత్తపల్లిలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఆయన సతీమణి సుజాతమ్మ మృతికి సంతాపం తెలిపారు. వారి వెంట కృష్ణారెడ్డి, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కుమ్మరి జగన్, చావా భాపారావు, శ్రీనాథ్‌రావు తదితరులు ఉన్నారు.

### మెదక్ ఎమ్మెల్యే పరామర్శ

కొత్తపల్లి సొసైటీ చైర్మన్ రమేశ్‌ను మెదక్ మ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సోమవారం పరామర్శించారు. సుజాతమ్మ మృతిపై ఆయన సంతాపం వ్యక్తం చేశారు.

## అడవి పంది దాడిలో మహిళకు గాయాలు



గాయపడిన మహిళ

చిన్నశంకరంపేట, మార్చి 31: అడవిపంది దాడిలో మహిళకు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని ఎస్.కొండాపూర్ గ్రామ శివారులో సోమవారం జరిగింది. గవ్వలపల్లి గిరిజన తండాకు చెందిన దేవసోత్, లక్ష్మి దంపతులు తమ వాహనంపై మెదక్ వెళ్లి తిరిగి వస్తున్నారు. ఎస్.కొండాపూర్ గ్రామ శివారులోని రాజుల గుట్ట వద్ద వాహనం ఆపి మహిళ బహిర్భూమికి వెళ్లింది. అక్కడే ఉన్న అడవిపంది ఆ మహిళపై దాడి చేసింది. దీంతో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో మెదక్ ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు.

## ఆపద మిత్ర వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందజేస్తున్న అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 31: ఆపద మిత్ర పథకంలో భాగంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో 200 మంది వలంటీర్లకు అదనపు కలెక్టర్ నగేశ్ సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. మార్చి 20 నుంచి 31వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్, ప్రభుత్వ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలపై శిక్షణనిచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లకు గిరిజన కళాశాలలోని సెమినార్ హాల్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆపద మిత్ర రాష్ట్ర నోడల్ అధికారి గౌతం, జిల్లా యువజన క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి, పోలీసు శాఖ, అగ్రిమాపక శాఖ, నీటిపారుదల శాఖ అధికారులు, మెప్మా ఉద్యోగులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఢిల్లీ పోరు గర్జనకు బీసీ సంఘం నేతలు



పోరు గర్జనకు బీసీ సంఘం నేతలు

తూప్రాన్, మార్చి 31: దమాషా ప్రకారం బీసీల కోసం ప్రతిపాదించిన 42 శాతం రిజర్వేషన్లను పార్లమెంటులో ప్రవేశపెట్టి, అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఢిల్లీ పోరు గర్జనకు తూప్రాన్‌కు చెందిన బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నలింగ్ మల్లికార్జున్ ఆధ్వర్యంలో సోమవారం బయలుదేరారు. అగ్రవర్ణాల ప్రజలు తరతరాలుగా బీసీలను ఓటేసే యంత్రాలుగా, జెండాలు మోసే కూలీలుగా మార్చారన్నారు. ఇప్పటికైనా చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యర్శి యాదగిరి యాదవ్, నర్సాపూర్ ఇన్‌చార్జి నరేందర్ గౌడ్, రమేశ్, సమంత్ గౌడ్, యాదగిరి, ఎగొండ, శ్రీకాంత్, క్రమశిక్షణ కమిటీ ప్రెసిడెంట్ గణేశ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



నర్సింహాచారి (ఫైల్)

నిజాంపేట, మార్చి 31: మనస్తాపంతో యు వకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేటలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కమ్మరి నర్సింహాచారి (20)కి చిన్నప్పుడే తల్లి మృతి చెందింది. దీంతో నానమ్మ కమలమ్మ వద్దనే పెరిగాడు. కమలమ్మ వయస్సు పైబడటంతో పనిచేయడం వీలైతలేదు. ఇంకా ఎన్ని రోజులు పని చేయకుండా తిరుగుతావని నర్సింహాచారిని ఆమె మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు క్షణికావేశంలో తన ఇంటికి ఆనుకుని ఉన్న షట్టర్ పైకప్పుకు చీరతో ఉరేసుకున్నాడు. కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మృతుడి అంత్యక్రియలకు సాయంగా బీఆర్ఎస్ నాయకుడు కంతారెడ్డి తిరుపతిరెడ్డి రూ.5వేలను స్థానిక నాయకుడు నాగరాజు ద్వారా అందజేశారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



దాసరి యాదగిరి

తూప్రాన్, మార్చి 31: కుటుంబ కలహాలతో బయటకు వెళ్లిన వ్యక్తి మ్యాడక చెరువు లో శవమై తేలిన ఘటన తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పట్టణానికి చెందిన దాసరి యాదగిరి(47)కు చెందిన పొలాన్ని వేరే వ్యక్తి తన పేరిట పట్టా చేయించుకున్నాడు. తమ పొలం తమ పేరిట చేయడం లేదనే కారణంతో యాదగిరి భార్య ప్రవీణతో తరచూ గొడవలు జరిగేవి. ఈనెల 30న ఇంట్లో నుంచి ఎక్కడికో వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. సోమవారం వెతుకుతుండగా ఉదయం 12 గంటల సమయంలో తూప్రాన్‌లోని మ్యాడక చెరువులో యాదగిరి మృతదేహం ఉండడాన్ని స్థానికులు గమనించారు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే తన భర్త దాసరి యాదగిరి మృతిచెందాడని మృతురాలి భార్య దాసరి ప్రవీణ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

## మొబైల్ షాపులో చోరీ

కౌడిపల్లి, మార్చి 31: మొబైల్ షాపులో చోరీ అయిన ఘటన కౌడిపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మద్‌నగర్‌కు చెందిన భరత్ గౌడ్‌కు వెల్మకన్న రోడ్డులో భవ్య మొబైల్ షాపు ఉంది. రోజు మాదిరిగానే రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం షాపు తెరిచి చూడగా డబ్బా వెనుక భాగం నుంచి రేకులు తీసినట్లు గమనించాడు. రిపేరింగుకు వచ్చిన 7 ఆన్‌రైడ్ మొబైల్ పోన్లు, గల్లా పెట్టెలోని చిల్లర పైసలు చోరీ అయినట్లు బాధితుడు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## బాధిత దళితులకు న్యాయం చేయాలి



చిలిపిచెడ్, మార్చి 31: దళిత వర్గాలకు చెందిన ఇల్లు, రేకుల షెడ్లకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తహసీల్దార్, ఆర్ ఐ కక్ష పూరితంగా ధ్వంసం చేయడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, సీపీఎం మండల కన్వీనర్ మల్లేశం తెలిపారు. సోమవారం చండూర్‌లో ధ్వంసమైన ఇల్లు, రేకుల షెడ్లలను వారు పరిశీలించారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. వారితో మండల నాయకుడు దుర్గాదాస్ మాదిగ, స్వామి, ప్రసాద్, మొగులయ్య, ఎల్లయ్య, లక్ష్మణ్, యాదిగిరి తదితరులు ఉన్నారు.

# గ్రామాలు, తండాల్లో దాహార్తి



రామాయంపేట రూరల్: సుతారిపల్లిలో ట్యాంకు వద్ద మహిళలు



చిలిపిచెడ్: చండూర్‌లో ఖాళీ బిందెలతో ఎస్సీ, ముస్లిం కాలనీవాసులు



నీటి కోసం కుటుంబ సభ్యులంతా కలిసి వెళ్తున్న దృశ్యం

- మిషన్ భగీరథ నీటి సరఫరాలో నిర్లక్ష్యం
- గంటల తరబడి నల్లాల వద్ద వేచి ఉంటున్న మహిళలు
- నీళ్ల కోసం వ్యవసాయ బోరు బావులపై ఆధారం
- ట్యాంకర్లను కూడా పెట్టలేని పరిస్థితిలో అధికారులు



రామాయంపేట రూరల్: సన్నటిధారగా నీళ్లు పోస్తున్న భగీరథ నల్లా



చిలిపిచెడ్: బద్రియ తండాలో బోర్ల నుంచి నీళ్లు తీసుకొస్తున్న ప్రజలు

రామాయంపేట రూరల్, మార్చి 31: వేసవి ప్రారంభంలోనే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొన్నది. చాలావరకు గ్రామాల్లో సరిపడే నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు కూడా సన్నటిధారలా రావడంతో గంటల తరబడి బిందెలు పట్టుకుని నల్లాల వద్ద వేచి చూడాల్సి వస్తున్నది. కేసీఆర్ ప్రభుత్వం గ్రామాలకు తాగునీటి ఎద్దడి లేకుండా మిషన్ భగీరథ నీటిని అందించింది. సరాఫరాలో ఏదైనా అంతరాయం కలిగితే పంచాయతీ బోర్ల ద్వారా గ్రామాల్లోని ట్యాంకులు, బస్తీల్లోని మినీ ట్యాంకులకు నీటిని అందించి, సమస్య లేకుండా చేసింది. నేడు అందుకు భిన్నంగా మిషన్ భగీరథను సరిగా నిర్వహించలేక, నీటి సరఫరా లేక, నానా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో ఉన్న బోర్ల నుంచి నీటిని అందించాలని కోరితే, అవి రిపేరులో ఉన్నాయని, కాలిపోయాయని చెబుతున్నారు. కనీసం ట్యాంకర్లను పెట్టడానికి కూడా పంచాయతీల్లో డబ్బులేవని అధికారులు చెప్పడం గమనార్హం.

### చండూర్, బద్రియ తండాల్లో తాగునీటి తిప్పలు

చిలిపిచెడ్, మార్చి 31: మండలంలోని బద్రియ, చండూరులో తాగునీటి తిప్పలు తప్పడంలేదు. నీటి కోసం వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొన్నది. చండూర్‌లో ఎస్సీ, ముస్లిం కాలనీ, బంజారా నగర్ తండాలో తాగునీటి సమస్య ఏర్పడింది. మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్యలపై ఏ అధికారి స్పందించడంలేదని ఆరోపిస్తున్నారు.

# ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

- జిల్లా వ్యాప్తంగా భక్తశ్రద్ధలతో ప్రార్థనలు
- సమాధుల వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులు
- ఖవ్వాలి వినిపించిన ముస్లిం మతపెద్దలు
- రంజాన్ మాసం పవిత్రమైనది
- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి
- రంజాన్ మతసామరస్యానికి ప్రతీక
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- రంజాన్ ముస్లింలకు అతి పెద్ద పండుగ
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మెదక్ మున్సిపాలిటీ: రంజాన్ ప్రార్థనల అనంతరం మత పెద్దలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



నర్సాపూర్: పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనల అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



చేగుంట: ఈద్గ వద్ద పార్థనలో పాల్గొన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



అల్లాదుర్గం: గడిపెద్దాపూర్ ఈద్గా వద్ద ప్రార్థనలు



రామాయంపేట: ఈద్గావద్ద ఖవాలీ వినిపిస్తున్న మతపెద్ద

రంజాన్ మాసం దానధర్మాలకు నిలయమని, సమాజంలో పేదలను ఆదుకోవడమే ఈద్-ఉల్-ఫితర్ పరమార్థమని ముస్లిం మత గురువులు బోధించారు. రంజాన్‌ను పురస్కరించుకుని ఈద్గా మైదానానికి తరలివచ్చిన ముస్లింలతో ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. సమాజంలోని అన్ని మతాల వారు కలిసి మెలసి ఐకమత్యంగా ఉండాలని హితువు పలికారు. ఆపదలో ఉన్న వారికి, నిరుపేదలకు సహాయ సహకారాలు అందించాలని సూచిస్తూ రంజాన్ పవిత్రతను వివరించారు.ఉపవాస దీక్ష అంటే మనసును నియంత్రించుకోవడం, ఆత్మను పవిత్రం చేసుకోవడమని గుర్తుచేశారు. అల్లా చూపించిన మార్గంలో భక్తిశ్రద్ధలతో నడుస్తూ పేదలకు సాయం చేస్తూ ఉండాలన్నారు. ఈద్గాల వద్ద ఖవ్వాలి నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

### మెదక్ జిల్లా కేంద్రంలో..

రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని బీఆర్ఎస్ జిల్లా ఆధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని సోమవారం మెదక్‌లోని గాంధీనగర్ ఈద్గా వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్‌లో నెల రోజుల పాటు నిబద్ధతతో ఉపవాసాలు ఉండటం ద్వారా సమాజంపై ప్రేమ, గౌరవం కలుగుతాయన్నారు. ఈ మాసం దానధర్మాలకు ప్రత్యేకత అన్నారు. అన్ని మతాల ప్రజలు స్నేహభావంతో కలిసి ఉండాలని ఆకాంక్షించారు. వారి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్‌లు మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి, మాజీ కౌన్సిలర్లు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, గడ్డమీది కృష్ణాగౌడ్, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు జుబేర్, ఫాజిల్, మహమ్మద్, మధు, మోహన్, నాగేందర్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నర్సాపూర్‌లో..

రంజాన్ మత సామరస్యానికి ప్రతీక అని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. పండుగ సందర్భంగా నర్సాపూర్‌లోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సంతోష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ నయీమొద్దీన్ ఉన్నారు.

### చేగుంటలో..



పాపన్నపేటలో అలయ్‌బలయ్ తీసుకుంటున్న చిన్నారులు

పవిత్రతతో కూడిన రంజాన్ ముస్లింలకు పెద్ద పండుగ అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. చేగుంటలోని ఈద్గా వద్ద ముస్లింల ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముస్లింలతో అలయ్‌బలయ్ చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మైనార్టీ మండల నాయకులు మహ్మద్‌అలీ, బీఆర్ఎస్ అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, మంచికట్ల శ్రీనివాస్, జిల్లా నాయకుడు రంగయ్యగారి రాజిరెడ్డి, సుభాష్‌రెడ్డి, ఎర్ర యాదగిరి పాల్గొన్నారు.

**- న్యూస్‌నెట్‌వర్క్, మెదక్, మార్చి 31**



మెదక్ మున్సిపాలిటీ: గాంధీనగర్ ఈద్గా వద్ద ప్రార్థనలు



నర్సాపూర్ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు



శివ్వంపేట: దొంతి గ్రామంలో ప్రార్థన చేస్తున్న ముస్లింలు

# పక్కాగా రాజీవ్ యువ వికాసం అమలుచేస్తాం



హవేలీఘనపూర్‌లోని మీసేవ సెంటర్లో రాజీవ్ యువ వికాసం పోర్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అధికారులు

**- కలెక్టర్ రాహుల్‌రాజ్**

మెదక్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఆర్థికసాయం అందించడానికి ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం హవేళీఘనపూర్‌లోని మీసేవ సెంటర్లో రాజీవ్ యువ వికాసం పోర్టల్‌ను కలెక్టర్ పరిశీలించారు. స్వయంగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని నిర్వాహకులు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటివరకు హవేళీఘనపూర్ మండలంలో 68 దరఖాస్తు స్వీకరించినట్లు తెలిపారు. ఈ పథకంలో 75 రకాల యూనిట్లు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా డీఆర్డీవో ఉంటారన్నారు. https://tgobmms.gg.gov.in ఆన్‌లైన్ దరఖాస్తు చేయాలని, ప్రింట్ తీసిన దరఖాస్తును ఎంపీడీవో, మున్సిపల్ పరిధిలో మున్సిపల్ కమిషనర్‌కు అందచేయాలని సూచించారు. దరఖాస్తులు స్వీకరణకు ఈనెల 5వ తేదీ చివరి గడువన్నారు.

### ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి

రాజీవ్ యువ వికాస పథకానికి ఎక్కువమంది దరఖాస్తులు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం రాజీవ్ యువ వికాసం పథకంపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొని ఈ పథకానికి ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో ఎల్డీఎం నరసింహమూర్తి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీవో పీడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

### నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం



మనోహరాబాద్, మార్చి 31: నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఐటీసీ పరిశ్రమ సహకారంతో మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.2.40లక్షలతో జాతీయ రహదారిపై ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నైజ్ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేశా రు. సీఐ రంగకృష్ణ, ఎస్ఐ సుభాష్‌గౌడ్, పరిశ్రమ హెచ్ఆర్ సూర్య భగవాన్ పాల్గొన్నారు.

### హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 31: విద్యా సంస్థలకు సంబంధించిన భూములను అమ్మడమంటే విద్యావ్యవస్థ పతనానికి దారి తీసినట్లేనని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు కసాపురం కిరణ్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. హెచ్‌సీయూ భూముల అమ్మకానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండించారు. హెసీయూ భూముల అమ్మకాలకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలన్నీ ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. హెచ్‌సీయూలో మోహరించిన పోలీసులను వెంటనే వెనక్కి పంపాల డిమాండ్ చేశారు.

### టీచర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్న ప్రభుత్వం

వెల్దుర్తి, మార్చి 31: టీచర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరికెల వెంకటేశం సోమవారం ప్రకటనలో ఆరోపించారు. ఉపాధ్యాయులకు ఏడాదిలో 50 శాతం సెలవులు ఉంటాయని అనడం సరికాదన్నారు. పెండింగ్ డీఏలు, పీఆర్సీల గురించి అడిగితే ప్రభుత్వానికి ఉపాధ్యాయుల పనిదినాలు గుర్తుకు వస్తున్నాయన్నారు.

### ఘనంగా ఉమా కేదారేశ్వర స్వామి వార్షికోత్సవం

పాపన్నపేట, మార్చి 31: మండలంలోని నాగుసానిపల్లిలో ఉమా కేదారేశ్వర స్వామి 42వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాధవానంద సరస్వతీ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. 58 జంటలతో సత్యనారాయణ వ్రతాలు జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు.

### గుండెపోటుతో వ్యక్తి మృతి



చేగుంట, మార్చి 31: గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కర్నాల్‌పల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన చింతాకుల భిక్షపతి (45) బతుకు దెరువుకోసం హైదరబాద్‌కు వెళ్లి జీవిస్తున్నాడు. సోమవారం గుండెపోటు రావడంతో దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

### జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

మెదక్ అర్బన్, మార్చి 31: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు పోలీస్ యాక్ అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. పోలీస్ యాక్ట్ ప్రకారం పోలీస్ అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్చరించారు.

### మల్కాపూర్ మసీదులో అగ్ని ప్రమాదం

పెద్దశంకరంపేట, మార్చి 31: మల్కాపూర్ గ్రామంలోని మసీదులో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మొహర్రం పండుగకు సంబంధించిన దట్టీల కర్రలు, అన్నీ కాలిపోయాయి. సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

### పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ

చిలిపిచెడ్, మార్చి 31: ఫైజాబాద్‌కు చెందిన దాసరి శివరాజ్‌కు మంజూరైన రూ.60 వేల చెక్కును మండల యూత్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం అందజేశారు. సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు అండ అన్నారు. బుచ్చిరెడ్డి, నాగేశ్, లక్ష్మీనారాయణ, యాదగౌడ్, మల్లేశం, అశోక్, రాజు, సుధీర్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.